# సాక్షి

## శ్రీసత్యసాయి జిల్లా

శనివారం । 22 । మార్చి । 2025






### టన్ను చీనీ రూ.25 వేలు

అనంతపురం మార్కెట్‌యార్డులో శుక్రవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.25 వేలు, కనిష్టంగా రూ.4 వేల ప్రకారం ధర పలికాయి.



### స్థిరంగా టమాట ధర

మార్కెట్‌లో టమాట ధర స్థిరంగా కొనసాగుతోంది. కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట గరిష్టంగా రూ.8, కనిష్టంగా రూ.6 ప్రకారం ధర పలికింది.




## న్యూస్‌రీల్

### పోక్సో కేసులో ముద్దాయికి 20 ఏళ్ల జైలు

పుట్టపర్తి టౌన్: పోక్సో కేసులో ముద్దాయికి 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష పడింది. ఈ మేరకు అనంతపురం స్పెషల్ సెషన్స్ జడ్జి శుక్రవారం తీర్పు చెప్పారు. నల్లమాడ మండలం ఎనుమలవారిపల్లికి చెందిన కుళ్లాయప్ప కుమారుడు వీరానిపల్లి చిరంజీవి (22) ఓ బాలికను ఇంటి వద్ద వదిలిపెడతానని తన ఆటోలో తీసుకెళ్లి అసభ్యకరంగా ప్రవర్తించాడు. బాధిత బాలిక తల్లి ఫిర్యాదు మేరకు కదిరి పోలీస్ స్టేషన్‌లో 2019 మార్చి 22న కేసు నమోదు చేశారు. నిందితుడిని అదే రోజు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అప్పటి సీఐ బి.వెంకట చలపతి కేసు దర్యాప్తు చేశారు. అనంతరం సీఐ టి.మధు జిల్లా సెషన్స్ కోర్టులో నిందితుడు వీరానిపల్లి చిరంజీవి అలియాస్ చిరుపై చార్జ్‌షీటు దాఖలు చేశారు. ఈ కేసును అనంతపురం ప్రత్యేక న్యాయస్థానానికి బదిలీ చేశారు. గురువారం ఈ కేసును ట్రయిల్ చేసి మొత్తం 14 మంది సాక్షులను విచారణ చేశారు. నేరం రుజువు కావడంతో ముద్దాయి వీరానపల్లి చిరంజీవి అలియాస్ చిరుకు 20 సంవత్సరాల కఠిన కారాగారశిక్ష, రూ.1000 జరిమానా విధిస్తూ జిల్లా ప్రత్యేక న్యాయస్థానం (పోక్సో కోర్టు) శుక్రవారం సంచలన తీర్పు వెలువరించింది. బాధితురాలికి రూ.3 లక్షల నష్టపరిహారం ఇవ్వాలని తీర్పులో పేర్కొన్నారు. స్పెషల్ పీపీ ఈశ్వరమ్మ, విద్యాపతి వాదించారు.

### మెడికల్ షాపుల్లో అధికారుల తనిఖీలు



హిందూపురంలో ఓ మెడికల్ షాపును తనిఖీ చేస్తున్న అధికారులు

హిందూపురం టౌన్: 'ఆపరేషన్ గరుడ'లో భాగంగా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ హనుమన్న, విజిలెన్స్ అధికారులు, 'ఈగల్' అధికారులు సంయుక్తంగా శుక్రవారం ఉమ్మడి అనంతపురం జిల్లాలోని ఏడు మెడికల్ షాపులపై దాడులు చేశారు. హిందూపురంలోని నాగశ్రీ, జనతా, బృంద మెడికల్ షాపుల్లో తనిఖీలు నిర్వహించారు. నిబంధనల అతిక్రమణలపై కేసులను నమోదు చేశారు. ఒక మెడికల్ షాపులో కాలం చెల్లిన ఔషధాలను గుర్తించారు. ఉమ్మడి జిల్లాలోని నాలుగు షాపుల్లో డాక్టర్ల ప్రిస్క్రిప్షన్ లేకుండా మత్తు కలిగించే (ఎన్ఆర్ఎక్స్) మందుల కొనుగోలు, అమ్మకాలలో వ్యత్యాసాలు గుర్తించినట్లు అనంతపురం ప్రాంతీయ నిఘా, అమలు అధికారి వైబీపీటీఏ ప్రసాద్ తెలిపారు. దాడుల్లో విజిలెన్స్ సీఐలు జమాల్‌బాషా, సద్గురుడు తదితరులు పాల్గొన్నారు.

### ఇంగ్లిష్ పరీక్షకు 111 మంది గైర్హాజరు

పుట్టపర్తి: జిల్లాలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో కొనసాగుతున్నాయి. శుక్రవారం జరిగిన ఇంగ్లిష్ పరీక్షకు 111 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు జిల్లా విద్యాశాఖ అధికారి కృష్ణప్ప తెలిపారు. జిల్లాలోని 104 కేంద్రాల్లో జరిగిన పరీక్షకు 21,396 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా, 21,285 మంది విద్యార్థులు హాజరయ్యారని వివరించారు.

### 13 మంది విద్యార్థుల డీబార్

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం క్యాంపస్‌లో ఎల్ఎల్‌బీ మొదటి, ఆరో సెమిస్టర్ పరీక్షల్లో మాస్ కాపీయింగ్‌కు పాల్పడిన 13 మంది విద్యార్థులను డీబార్ చేసినట్లు డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ జీవీ రమణ తెలిపారు. ఇంజినీరింగ్ కళాశాలలోని పరీక్ష కేంద్రంలో ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర మాస్‌కాపీయింగ్‌కు పాల్పడుతున్న విద్యార్థులపై చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు.

# రాలిన ఆశల పూత



ఈ చిత్రంలో కనిపిస్తున్న రైతు పేరు వెంకట్రాముడు. బుక్కపట్నం మండలం కడపనాగేపల్లి గ్రామం. తన ఇద్దరు అన్నదమ్ములతో కలిసి పాతికేళ్లుగా 10 ఎకరాల్లో మామిడి సాగు చేస్తున్నాడు. ఈ సారి పూత బాగా రావడంతో ఆనందపడ్డాడు. కానీ తేనెమంచుకు పూతమొత్తం రాలిపోవడం ప్రారంభమైంది. దీంతో పంటను కాపాడుకునేందుకు రూ.1.50 లక్షలు ఖర్చు చేసి రసాయన మందులు పిచికారీ చేశాడు. ఇదికాక చెట్ల పాదుల్లో మరో రూ.2 లక్షల మందులు వేశాడు. మొత్తంగా కూలీల ఖర్చుతో పాటు పురుగుమందులకే రూ.3.50 లక్షలు ఖర్చు చేశాడు. అయినా పావువంతు కూడా పిందెగా మారలేదు. దీంతో ఈసారి పెట్టుబడి కూడా చేతికందే పరిస్థితి లేదని వెంకట్రాముడు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

... జిల్లాలోని చాలామంది మామిడి రైతులది ఇదే పరిస్థితి. గత ఏడాది తీవ్ర నష్టాలు మూటగట్టుకున్న మామిడి రైతులు..ఈ ఏడాదన్నా గట్టెక్కుదామని భావించారు. అందుకే తెగుళ్లు సోకినా రూ.లక్షలు ఖర్చు చేసి పురుగు మందులు కొట్టారు. అయినా ఫలితం లేకపోవడంతో కనీసం ప్రభుత్వమైనా ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

- సీజన్ ప్రారంభంలో పూతతో ఊరించిన మామిడి
- తెగుళ్లు సోకడంతో పిందెలు రాని పరిస్థితి
- పురుగుల మందులకు ఇప్పటికే రూ.లక్షలు ఖర్చు
- దిక్కుతోచని స్థితిలో మామిడి రైతు
- ప్రభుత్వమే ఆదుకోవాలని వేడుకోలు



ప్రారంభంలో విరగపూసిన మామిడి పూత



పూతరాలిపోయి కాయలు లేక ఆకులతో కనిపిస్తున్న మామిడి చెట్లు



రాలిన మామిడి పిందెలు



పూతను ఆవహించిన పేను బంక

పుట్టపర్తి: తీపి పంచాల్సిన మామిడి రైతుకు చేదు మిగులుస్తోంది. వరుసగా రెండో ఏడాదీ పంట చేతికందే పరిస్థితి లేకపోకపోవడంతో రైతు పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. సీజన్ ప్రారంభంలో పూత విరగపూయగా...రైతుల్లో ఆశలు చిగురించాయి. ఆ తర్వాత తెగుళ్లు సోకినా దిగుబడిపై నమ్మకంతో రూ.లక్షలు ఖర్చు చేసి పురుగుల మందులు పిచికారీ చేశారు. అయినా ఫలితం లేకపోవడంతో పూత మొత్తం రాలిపోయింది. పెట్టుబడులు కూడా దక్కే అవకాశం లేకపోవడంతో రైతు పరిస్థితి దారుణంగా తయారైంది.

**పెట్టుబడి దక్కడం గగనమే..**

జిల్లాలో 20 వేల హెక్టార్లలో మామిడి తోటలు సాగులో ఉన్నాయి. అత్యధికంగా బుక్కపట్నం మండలం బుచ్చయ్యగారిపల్లి ప్రాంతంలో మామిడి తోటలు ఎక్కువగా ఉన్నాయి. ఇక్కడ వందేళ్ల వయస్సు కలిగిన చెట్లు కూడా ఉన్నాయి. ప్రస్తుతం మార్కెట్‌లో టన్ను రూ.లక్ష పలుకుతుండగా... ఖర్చులు పోను ఎకరాకు రూ.2 లక్షల ఆదాయం రావాలి. కానీ తెగుళ్లతో పంట దిగుబడులు ప్రశ్నార్థకమయ్యాయి. ప్రస్తుతం పూత దశలో ఉన్న మామిడి చెట్లకు పేను బంక తెగులు పువ్వంతా నిండిపోవడంతో రైతు బెంబేలెత్తిపోతున్నారు. రూ.లక్షలు వెచ్చించి మందులు పిచికారీ చేసినా పేను బంక తెగులు అదుపులోకి రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పువ్వు మొత్తం బంకతో నిండిపోయి పువ్వు వాడిపోవడం, పిందెలు సైతం రాలిపోతుండడంతో దిక్కు తెలియని పరిస్థితి నెలకొందంటున్నారు. ఎండ తీవ్రత అధికమవుతున్న నేపథ్యంలో పేను బంక తీవ్రత మరింత పెరిగింది. దీంతో ఈసారి పెట్టుబడి కూడా దక్కే పరిస్థితి లేక రైతులు దిగాలు పడుతున్నారు. మామిడి సాగు వల్ల ప్రత్యామ్నాయ పంటలకూ అవకాశం లేకుండా పోయింది. దీంతో ఎటూ కాకుండా పోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ప్రభుత్వమే ఆదుకోవాలి..**

మామిడి పంట వేసిన వేలాది మంది రైతులు గత ఏడాది నామమాత్ర లాభాలతో బయట పడ్డారు. ఈసారైనా బయటపడదామని అనుకుంటే 'పేను బంక', నల్లతామర తదితర తెగుళ్లు ఊపిరాడకుండా చేస్తున్నాయి. ప్రసుత్తం లాభాల మాటేమో గాని నష్టపోయే పరిస్థితి దాపురించింది. దీంతో ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. ఈ ఏడాది తీసుకొచ్చిన పంటల బీమా వల్ల పెద్దగా ఉపయోగం లేదంటున్నారు. బీమా చేసినా... చేయకపోయినా పరిహారం అందించాలని.. ఈ మేరకు బీమా నిబంధనల్లో మార్పులు చేయాలని కోరుతున్నారు. పంట దెబ్బతిన్న ప్రతి రైతుకు పరిహారం చెల్లించాలని కోరుతున్నారు.

### పరిహారం ఇవ్వాలి



మా పెద్దలు 40 ఏళ్ల కిందట మామిడి తోట పెట్టారు. నేను 30 ఏళ్లుగా మామిడి సాగు చేస్తున్నా. గత ఏడాది దిగుబడి తగ్గి తీవ్ర నష్టాలు చవిచూశాం. ఈసారైనా గట్టెక్కుదామంటే తెగుళ్లు నిండా ముంచేశాయి. పూత మొత్తం రాలిపోగా పెట్టుబడి కూడా దక్కే పరిస్థితి లేకుండా పోయింది. మానవతా దృక్పథంతో ప్రభుత్వమే మామిడి రైతులను ఆదుకోవాలి. వాతవరణ బీమాతో సంబంధం లేకుండా పరిహారం ఇవ్వాలి.

– అవుటాల రమణారెడ్డి, వ్యవసాయ సలహా మండలి మాజీ చైర్మన్, బుచ్చయ్యగారిపల్లి, బుక్కపట్నం మండలం

### తెగుళ్లతోనే సమస్య



ప్రస్తుతం మామిడికి తేనెమంచు, తామర, నల్లతామర తదితర తెగుళ్లు సోకాయి. దీంతో పూతతో పాటు అరకొర ఉన్న పిందెలు కూడా రాలిపోతున్నాయి. దీంతో ఈ ఏడాది మామిడి దిగుబడులు బాగా తగ్గే అవకాశం ఉంది. తెగుళ్ల నివారణకు యాజమాన్య పద్ధతులు పాటిస్తే పంటను కాపాడుకోవచ్చు. మరో నెలరోజులు గడిస్తే గానీ దిగుబడుల గురించి చెప్పలేం.

– చంద్రశేఖర్, జిల్లా ఉద్యానవన అధికారి

# స్వచ్ఛ ఓటరు జాబితాకు సహకరించండి



వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో చర్చిస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్

- రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ టీఎస్ చేతన్

ప్రశాంతి నిలయం: స్వచ్ఛ ఓటరు జాబితా తయారీకి సహకరించాలని రాజకీయ పార్టీల నాయకులను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ టీఎస్ చేతన్ కోరారు. ఓటర జాబితాలో ఏవైనా అభ్యంతరాలుంటే వెంటనే తెలపాలన్నారు. శుక్రవారం ఆయన కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్‌హాలులో ఎన్నికల అధికారులతో కలిసి జిల్లాలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నికల సంఘం అన్ని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు నుంచి అవసరమైన సూచనలు, సలహాలు తీసుకుంటుందన్నారు. జిల్లాలో 14,12,177 మంది ఓటర్లు ఉన్నారని, ఇందులో పురుషులు 7,01,586 మంది, స్త్రీలు 7,10,527 మంది, ఇతరులు 64 మంది ఉన్నారని తెలిపారు. అలాగే జిల్లా వ్యాప్తంగా 1,576 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ, తప్పుల్లేని ఓటరు జాబితా తయారీ, పోలింగ్ శాతం పెంచేందుకు అవసరమైన చర్యలు, యువతను ఓటరుగా నమోదు చేసే అంశాలపై సూచనలు, సలహాలు అందించాలని కలెక్టర్ కోరారు. అలాగే రాజకీయ పార్టీలన్నీ బూత్ స్థాయి ఏజెంట్లను నియమించుకోవాలన్నారు. జిల్లా యంత్రాంగం నుంచి అన్ని నియోజకవర్గాల బూత్ స్థాయి అధికారులను నియమించి త్వరలోనే శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. సమావేశంలో డీఆర్ఓ విజయసారథి, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ జాకీర్ హుస్సేన్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

**ప్రాథమిక అంశాలపై నివేదికలు ఇవ్వండి**

త్వరలోనే కలెక్టర్లతో ముఖ్యమంత్రి కాన్ఫరెన్స్ నిర్వహించనున్న నేపథ్యంలో జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖలకు సంబంధించిన ప్రాధాన్య అంశాలపై నివేదికలు సమర్పించాలని కలెక్టర్ చేతన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్‌హాలులో అన్ని ప్రభుత్వ విభాగాల జిల్లా అధికారులతో ఆయన సమావేశమయ్యారు. జిల్లాకు సంబంధించిన ప్రగతి, ప్రధాన సమస్యలను ప్రస్తావిస్తూ నివేదికలు సిద్ధం చేయాలన్నారు. రాబోయే మూడు నెలల్లో పంచాయతీ, మున్సిపల్, ఇరిగేషన్, డ్వామా, గ్రామీణ నీటి సరఫరా విభాగం, మత్స్య, గృహ, విద్య, వైద్య ఆరోగ్య, పరిశ్రమలు, డీఆర్‌డీఏ, లీడ్ బ్యాంక్, వ్యవసాయం, అనుబంధ రంగాలు, సంక్షేమ శాఖలు, సేవా రంగాల శాఖలు తదితర శాఖల పరిధిలో నిర్వహించాల్సిన ముఖ్యమైన కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేయాలన్నారు.

### ఫారంపాండ్ల పనులు గ్రౌండింగ్ చేయాలి

జిల్లాలోని ప్రతి గ్రామ పంచాయతీలో 3 నుంచి 5 ఫారంపాండ్ల పనుల కోసం గ్రౌండింగ్ చేయాలని కలెక్టర్ టీఎస్ చేతన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రపంచ జల దినోత్సవం, పల్లె పండుగ కార్యక్రమంపై శుక్రవారం రాష్ట్ర సచివాలయం నుంచి ఉప ముఖ్యమంత్రి, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పవన్ కల్యాణ్ వివిధ జిల్లాల కలెక్టర్లతో సమీక్షించారు. అనంతరం కలెక్టర్ టీఎస్ చేతన్ జిల్లా అధికారులతో సమావేశమయ్యారు. జిల్లాలో 7,760 ఫారం పాండ్లు నిర్మించాలని లక్ష్యం నిర్దేశించుకున్నామన్నారు. అందులో ఇప్పటిదాకా 1,784 ఫారంపాండ్లు మంజూరు కాగా, 840 పూర్తి చేశామన్నారు. ఈ నెలాఖరు నాటికి పశువుల షెడ్ల లక్ష్యాలను సాధించాలని డ్వామా పీడీని ఆదేశించారు. కార్యక్రమంలో డ్వామా పీడీ విజయేంద్ర ప్రసాద్, జెడ్పీ డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్య, డీపీఓ సమత తదితరులు పాల్గొన్నారు.

# తాగునీటి కోసం నిరసన



ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

- కల్లూరు ఎస్సీ కాలనీలో ఐదు నెలలుగా తాగునీటి సమస్య
- పట్టించుకోని అధికారులు... ఖాళీ బిందెలతో రోడ్డెక్కిన మహిళలు

లేపాక్షి: బోర్లలో నీరు పుష్కలంగా ఉంది..పైప్‌లైన్ సమస్య లేదు. మోటార్లు బాగానే పనిచేస్తున్నాయి. కానీ నిర్వహణ లోపంతో కల్లూరు ఎస్సీ కాలనీ వాసులు ఐదు నెలలుగా తాగునీటి కోసం పడరాని పాట్లు పడుతున్నారు. అధికారులకు పలుమార్లు విన్నవించినా ఫలితం లేకపోవడంతో శుక్రవారం కాలనీ మహిళలు ఖాళీ బిందెలతో బస్టాండు వద్ద రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. వెంటనే నీటి సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు మాట్లాడుతూ, తమ కాలనీలో వ్యక్తిగత కొళాయిలు లేవని, దీంతో పబ్లిక్ ట్యాప్‌ల వద్దే నీరు పట్టుకుంటామన్నారు. నీరు తగినంత అందుబాటులో ఉన్నా సరఫరా చేయడంలో నిర్వాహకులు తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. దీంతో కుటుంబానికి రెండు, మూడు బిందెల నీరు అందడం లేదన్నారు. దీంతో నీటికోసం తాము ఐదు నెలలుగా పనులు మానుకుని పడరానిపాట్లు పడుతున్నామన్నారు. నీటి సమస్యతో హోలీ పండుగ కూడా చేసుకోలేక పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే నీటి సమస్య పరిష్కరించకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.



# నేత్రపర్వం.. శ్రీవారి అలుకోత్సవం



అలుకోత్సవంలో శ్రీదేవి, భూదేవి సమేత నారసింహుడు





శ్రీవారికి పట్టు వస్త్రాలు తీసుకువస్తున్న ఆలయ ఈఓ శ్రీనివాసరెడ్డి కుటుంబ సభ్యులు, నృత్యంతో భక్తులను అలరిస్తున్న చిన్నారులు

కదిరి: బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఖాద్రీ లక్ష్మీ నరసింహస్వామి అలుకోత్సవం నేత్రపర్వంగా సాగింది. అనంతరం స్వామివారు అశ్వవాహనంపై తిరువీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. అంతకుముందు అర్చకులు యాగశాలలో నిత్యహోమం నిర్వహించారు. అనంతరం శ్రీవారికి విశేషాలంకరణ చేసి ఆలయానికి సమీపంలో ఉన్న సుద్దుల మండపం వద్దకు తీసుకువచ్చారు. ఆనవాయితీ ప్రకారం అలుకోత్సవం ఉభయదారులుగా వ్యవహరించిన ఆలయ సహాయ కమిషనర్ వెండిదండి శ్రీనివాసరెడ్డి దంపతులు శ్రీవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా అర్చకులు బ్రహ్మోత్సవాలు, అలుకోత్సవ విశిష్టతను భక్తులకు వివరించారు. ఆలయ ప్రాంగణంలో భక్తుల కాలక్షేపం కోసం ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి.

**నేడు తీర్థవాది ఉత్సవం..**

బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారికి శనివారం భృగుతీర్థం(కోనేరు)లో తీర్థవాది ఉత్సవం నిర్వహించనున్నారు. ఆదివారం(రేపు) నిర్వహించనున్న పుష్పయాగోత్సవంతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి.

## క్లుప్తంగా

### ఎలుగుబంటి దాడిలో ఒకరికి గాయాలు



కె.శివరం సమీపంలో సంచరిస్తున్న ఎలుగుబంటి

**అమరాపురం:** మండలంలోని కె.శివరం గ్రామ శివారులో ఓ వ్యక్తిపై ఎలుగుబంటి దాడి చేసింది. గ్రామానికి చెందిన పాడి రైతు మహంతేష్ గ్రామ సమీపంలోని పొలంలో గేదెకు గ్రాసం కోస్తుండగా పొదల మాటు నుంచి ఒక్కసారిగా ఎలుగుబంటి దాడి చేసింది. ఆ సమయంలో ప్రతిఘటించడంతో రెండు చేతులకు గాయాలయ్యాయి. మహంతేష్ కేకలు విన్న సమీపంలోని పొలాల్లో పనిచేస్తున్న వారు అక్కడకు చేరుకుని గట్టిగా కేకలు వేయడంతో ఎలుగుబంటి బెదిరి అక్కడి నుంచి పారిపోయింది. క్షతగాత్రుడిని హేమావతిలోని పీహెచ్‌సీకి తరలించారు. గ్రామ శివారలోకి ఎలుగుబంటి వచ్చిన విషయం తెలుసుకున్న స్థానికులు, అటవీ శాఖ అధికారులు అక్కడకు చేరుకుని గాలింపు చేపట్టారు.

### చిరుతల దాడిలో జీవాల మృతి



మృతి చెందిన జీవాలను చూపుతున్న రైతు

**పావగడ:** తాలూకాలోని కన్నమేడి గ్రామంలో చిరుతల దాడిలో నాలుగు గొర్రెలు, మేకలు మృతి చెందాయి. గురువారం సాయంత్రం ఈ ఘటన చోటు చేసుకుంది. బాధిత రైతు హనుమంతరాజు తెలిపిన మేరకు.. గ్రామం బయలు ప్రదేశంలో చెరువు వద్దకు గురువారం సాయంత్రం తన మేకలు, గొర్రెలను మేపునకు హనుమంతరాజు తీసుకెళ్లాడు. ఆ సమయంలో పొదల మాటు నుంచి వచ్చిన రెండు చిరుతలు మందపై దాడి చేశాయి. ఘటనలో రెండు గొర్రెలు, రెండు మేకలు మృతి చెందాయి. ఈ దృశ్యాన్ని కళ్లారా చూసిన హనుమంతరాజు భయభ్రాంతులకు గురయ్యాడు. జీవాల పెంపకంపైనే ఆధారపడి కుటుంబాన్ని పోషించుకుంటున్న తనకు నష్ట పరిహారం చెల్లించి ఆదుకోవాలని అటవీ శాఖ అధికారులను కోరాడు.

### బ్యాంకుల బంద్ వాయిదా

**అనంతపురం అగ్రికల్చర్:** ఈ నెల 24, 25న తలపెట్టిన బ్యాంకుల బంద్ వాయిదా పడింది. ఈ మేరకు బ్యాంకు ఉద్యోగుల యూనియన్ నాయకులు శుక్రవారం 'సాక్షి'కి తెలిపారు. జాతీయ కమిటీ, కేంద్ర ప్రభుత్వంతో జరిపిన చర్చల్లో సమస్యల పరిష్కారానికి సానుకూల స్పందన వ్యక్తమైన నేపథ్యంలో సమ్మెను ప్రస్తుతానికి వాయిదా వేస్తున్నట్లు జాతీయ కమిటీ నుంచి సమాచారం అందిందన్నారు.

# 'హరి-హర' క్షేత్రానికి అడుగులు

- భారీ ఆలయ నిర్మాణానికి రూపకల్పన చేసిన సనాతన ధర్మపరిరక్షణ వేదిక
- రూ.1,200 కోట్ల వ్యయంతో బృహత్ క్షేత్ర నిర్మాణం
- సమావేశంలో వెల్లడించిన సుప్రసిద్ధ స్థపతులు




వివరాలు వెల్లడిస్తున్న డీఎన్‌వీ ప్రసాద్ స్థపతి



300 అడుగుల ఎత్తుతో నిర్మించనున్న కోటిలింగాల ఆలయం నమూనా



108 అడుగుల విశ్వరూప సందర్శనంతో నిర్మించనున్న ఆలయ నమూనా

**అనంతపురం కల్చరల్:** ప్రపంచంలోనే ఎత్తైన 216 అడుగుల రామానుజల విగ్రహం, ఓంకారేశ్వరంలోని 108 అడుగుల ఆదిశంకర భగవత్పాదుల విగ్రహం, తెలంగాణాలో సుప్రసిద్ధి చెందిన యాదాద్రి గుట్టపై ఉన్న స్వర్ణగిరి మందిరాన్ని మించిన మరో అరుదైన ఆలయానికి 'అనంత' వేదికగా మారనుంది. సనాతన ధర్మ పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో నిర్మాణమయ్యే అపురూపమైన ఈ కట్టడ నమూనాలను అనంత ఆధ్యాత్మిక సంస్థల ప్రతినిధులు శుక్రవారం అనంతపురంలోని గీతామందిరంలో ధర్మప్రచార మండలి అధ్యక్షుడు శ్రీపాద వేణు, ఇస్కాన్ ఇన్‌చార్జి దామోదర గౌరంగదాసు నేతృత్వంలో జరిగిన విలేకరుల సమావేశంలో ప్రదర్శించారు. ఈ సందర్భంగా రెండు తెలుగు రాష్ట్రాల్లోని ప్రసిద్ధ ఆలయాలు, కట్టడాలను నిర్మించిన ప్రముఖ శిల్పులు డీఎస్‌వీ ప్రసాద్ స్థపతి, రాజమండ్రికి చెందిన శ్రీనివాస స్థపతి, తిరుమల గోవింద పీఠం పీఠాధిపతి శ్రీరామప్రియ యతీంద్ర స్వామీజీ తదితరులు మాట్లాడారు. వైదిక ధర్మాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని, మరోసారి ఆధ్యాత్మికంగా స్వర్ణయుగం రానున్న నేపథ్యంలో చేపట్టిన ఈ బృహత్ కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు.

ధార్మిక మండళ్ల ప్రతినిధులు పరాంకుశం కృష్ణశర్మ, ఆచార్య మనోరంజనరెడ్డి, చిదంబరం, శ్రీధర్, చంద్రశేఖర్, రంగారెడ్డి తదితరులు మాట్లాడుతూ.. కోటి మంది హిందువులను భాగస్వాములను చేస్తూ దాదాపు రూ.1,200 కోట్ల వ్యయంతో అనంత వేదికగా బృహత్ ఆలయాన్ని నిర్మిస్తున్నట్లు తెలిపారు. జిల్లా కేంద్రానికి సమీపంలోని నాయనిపల్లి క్రాస్ వద్ద ప్రాచీన విశేషాలతో కూడిన 'హరి-హర క్షేత్రం' నిర్మిస్తున్నట్లు వివరించారు. ప్రపంచంలోనే ఎత్తైన 300 అడుగుల కోటి లింగాల అపురూప మహాశివలింగం, దాని కిందనే దివ్య స్ఫటిక శ్రీచక్ర మేరువు, చుట్టూ అష్టాదశ శక్తిపీఠాల ఆలయాల ప్రతిష్టాపన జరుగుతాయన్నారు. దీనికి పక్కనే 108 అడుగుల శ్రీమన్నారాయణ విశ్వరూప దర్శన కాంస్య విగ్రహంతో పాటు, అదే పీఠంపై దశావతారాల విగ్రహాలు నిర్మిస్తున్నట్లుగా తెలిపారు. వీటికి ఎదురుగా 54 అడుగుల ఎత్తుతో నంది, గరుడ విగ్రహాలు, సప్తాశ్వ రథారూఢుడైన సూర్యదేవ విగ్రహం, త్రిమతాచార్యులైన ఆది శంకరులు, మధ్వాచార్యులు, రామానుజాచార్యుల విగ్రహాలను ఏర్పాటు చేస్తామన్నారు. అన్నింటి కంటే ప్రధానంగా ఈ విశాలమైన ప్రదేశంలో వైదిక ధర్మాన్ని నేర్పే సంస్కృత పాఠశాల, వేద విజ్ఞానాన్ని అందించే పుస్తక భాండాగారం, రిషి విజ్ఞాన డిజిటల్ లైబ్రరీ, ప్రాచీన ఆయుర్వేదాలయం, రామాయణ, భగవద్గీతల విశిష్టతలను తెలియజేసే కళాఖండాలూ నిర్మిస్తామన్నారు. దేశ విదేశాలలో స్థిరపడిన హిందువులు వచ్చి దర్శించుకునేందుకు వీలుగా పర్యాటకంగా ఈ ఆలయ ప్రాంతాన్ని అభివృద్ధి చేయనున్నట్లు ప్రత్యేక కమిటీగా ఏర్పడిన ధర్మ పరిరక్షణ వేదిక సభ్యులు వెల్లడించారు. నాలుగేళ్ల క్రితం ఈ అపురూప కట్టడం గోదావరి తీరంలో కట్టాలని సంకల్పించినా ఇక్కడి ఆధ్యాత్మికవేత్తల చొరవతో అనంతకు మార్చారన్నారు. ఈ ఏడాది ఆగస్టులో భూమి పూజ ఉంటుందని, అప్పటి నుంచి ఐదేళ్ల లోపు నిర్మాణం పూర్తి చేయనున్నట్లు పేర్కొన్నారు.

## హత్యకు పురిగొల్పిన అనుమానం

- సద్దాం హత్య కేసులో వీడిన మిస్టరీ
- నలుగురు నిందితుల అరెస్ట్



నిందితులను అరెస్ట్ చూపుతున్న పోలీసులు

**హిందూపురం:** వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడనే అనుమానమే సద్దాం హత్యకు కారణమైందని హిందూపురం డీఎస్పీ మహేష్ తెలిపారు. ఈ కేసులో ప్రధాన నిందితులు నలుగురిని అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు. శుక్రవారం స్థానిక పీఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను ఆయన వెల్లడించారు. హిందూపురం పట్టణానికి చెందిన షేక్ మహమ్మద్ షఫీ, రేష్మా అలియాస్ ఆయేషా దంపతులు. కుటుంబ పోషణకు స్థానిక ఓ రీలింగ్ యూనిట్‌లో ఆయేషా కార్మికురాలిగా పనిచేస్తోంది. ఈ క్రమంలో అక్కడే పనిచేస్తున్న సద్దాం బేగ్ పరిచయమయ్యాడు. ఇద్దరూ సన్నిహితంగా ఉండేవారు. ఈ విషయం తెలుసుకున్న షఫీ... తన భార్యపై అనుమానాలు పెంచుకుని ఈ నెల 15న ఆస్పత్రి వద్ద సద్దాం బేగ్‌తో గొడవపడ్డాడు. ఈ ఘటనకు సంబంధించి అందిన ఫిర్యాదు మేరకు అప్పట్లో పోలీసులు కేసు కూడా నమోదు చేశారు. దీంతో కక్ష పెంచుకున్న షఫీ.. ఈ నెల 17న రాత్రి తన కుటుంబసభ్యులతో కలసి సద్దాం బేగ్‌ను ద్విచక్ర వాహనంపై అపహరించి, మలుగూరు చెరువు కట్ట కింద వేట కొడవండ్లతో దాడి చేసి హతమార్చాడు. హతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టిన పోలీసులు పక్కా ఆధారాలతో కొట్నూర్ శివారులో తచ్చాడుతున్న షేక్ మహమ్మద్ షఫీతోపాటు అతని తమ్ముడు తౌఫిక్, చెల్లెలు రేష్మా, తల్లి సల్మాను అరెస్ట్ చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

### చోరీ కేసులో నిందితుడి అరెస్ట్

**తాడిపత్రి రూరల్:** మండలంలోని బందార్లపల్లి గ్రామంలో చోటు చేసుకున్న దొంగతనానికి సంబంధించి 24 గంటలు గడవక ముందే ఓ నిందితుడిని అరెస్టు చేసి 6.2 తులాల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తాడిపత్రి అప్‌గ్రేడ్ సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన వివరాలు వెల్లడించారు. గ్రామానికి చెందిన షేక్ హనీఫా ఇంటికి తాళం వేసి బుధవారం తాడిపత్రిలో తన తల్లి అంత్యక్రియల్లో పాల్గొనేందుకు వెళ్లింది. విషయాన్ని గమనించిన అదే గ్రామానికి చెందిన చిన్న బాషా ఇంటి తాళం పగులకొట్టి లోపలకు ప్రవేశించి బంగారాన్ని అపహరించాడు. ఘటనపై బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు పక్కా ఆధారాలతో శుక్రవారం నిందితుడిని అరెస్ట్ చేసి, చోరీ చేసిన సొత్తును స్వాధీనం చేసుకున్నారు.

## నేడు జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

- ప్రధాన సమస్యలపై నిలదీయనున్న సభ్యులు



**అనంతపురం సిటీ:** ఉమ్మడి జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు శనివారం జరగనున్నాయి. స్థాయీ సంఘం-1, 2, 4, 7 (ఆర్థిక, ప్రణాళిక/ గ్రామీణాభివృద్ధి/ విద్య, వైద్యం/ పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ శాఖల) సమావేశాలు ప్రధాన సమావేశ మందిరంలో జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అధ్యక్షతన నిర్వహించనున్నారు. స్థాయీ సంఘం-3, 5, 6 (వ్యవసాయం/ ఐసీడీఎస్/ సాంఘిక సంక్షేమ శాఖలు) సమావేశాలు ఆయా సంఘాల చైర్‌పర్సన్ల అధ్యక్షతన జెడ్పీ అదనపు భవన్‌లో నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను సీఈఓ రాజోలి రామచంద్రారెడ్డి, డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో పూర్తి చేశారు. సమావేశాలకు సంబంధించి సభ్యులతో పాటు ఆయా శాఖల అధికారులకు ఇది వరకే సమాచారం అందించారు. అయితే ఈసారి జరిగే సమావేశాలు వాడీవేడిగా జరగనున్నట్లు తెలుస్తోంది. జిల్లాలో ప్రధానంగా సాంఘిక సంక్షేమ వసతిగృహాల్లో సమస్యలు ఎక్కువగా ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండడం లేదు. అనంతపురం అర్బన్ ప్రాజెక్టులో ఓ అంగన్‌వాడీ టీచర్ విధులకు హాజరుకాకుండా ప్రైవేట్ కళాశాలలో అధ్యాపకురాలిగా పనిచేస్తున్న విషయం ఆధారాలతో సహా తేలినా ఇంతవరకూ చర్యలు తీసుకోలేదు. సామాజిక భద్రత పింఛన్లలో కోతలు, రేషన్ సరుకులను డీలర్లు సక్రమంగా పంపిణీ చేయకపోవడం తదితర సమస్యలు ఉన్నాయి. గృహనిర్మాణ శాఖలో ఉద్యోగుల పనితీరు, అవినీతి ఆరోపణలు ఉన్నాయి. తాగునీటి సమస్య తలెత్తకుండా ప్రణాళికలు రూపొందించడంలో అధికారులు విఫలమయ్యారు. ఈ సమస్యలన్నింటిపై సభ్యులు గళం విప్పనున్నారు. వాడీవేడీగా జరిగే అవకాశం ఉందని ముందే పసిగట్టిన స్పెషల్ బ్రాంచ్ పోలీసులు పరిస్థితులపై ఆరా తీసినట్లు తెలిసింది.

### బాధ్యతతో విధులు నిర్వర్తించాలి : డీఎంహెచ్‌ఓ



రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఫైరోజాబేగం

**హిందూపురం టౌన్:** అన్ని ఆరోగ్య కార్యక్రమాలు సకాలంలో ప్రజలకు చేరువయ్యేలా బాధ్యతతో విధులు నిర్వర్తించాలని ఆరోగ్య సిబ్బందికి డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఫైరోజా బేగం సూచించారు. శుక్రవారం హిందూపురంలోని జిల్లా ప్రభుత్వాస్పత్రి, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆమె తనిఖీ చేశారు. ఆయా కేంద్రాల్లోని రికార్డులు, ల్యాబ్ నిర్వహణ పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎన్‌సీడీ సర్వే, ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన కార్డ్స్ పంపిణీ, ఆరోగ్యశ్రీ వైద్య సేవలపై ఆరా తీశారు. పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలన్నారు. డాక్టర్లు, సిబ్బంది అందుబాటులో ఉంటూ రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీదేవి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

### యువకుడి ఆత్మహత్య

**డి.హీరేహాళ్ (రాయదుర్గం):** డి.హీరేహాళ్ మండలంలోని లింగమనహళ్లి గ్రామానికి చెందిన బసవరాజు (24) ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్‌ఐ గురుప్రసాద్ రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. వ్యవసాయంతో కుటుంబాన్ని పోషించుకుంటున్న బసవరాజుకు తల్లి భాగ్యమ్మతో పాటు ఓ సోదరుడు, సోదరి ఉన్నారు. అవసరాల నిమిత్తం రూ.20 లక్షల వరకు అప్పులు చేశాడు. ఈ క్రమంలో అప్పులు తీర్చేందుకు భూమి విక్రయిద్దామనుకుంటే అది కాస్త కోర్టు పరిధిలో ఉంది. దీంతో ఆర్థిక ఇబ్బందులు తలెత్తి జీవితంపై విరక్తితో శుక్రవారం పొలం వద్ద క్రిమి సంహారక మందు తాగాడు. గమనించిన చుట్టుపక్కల రైతులు వెంటనే బళ్లారిలోని విమ్స్‌కు తరలించారు. పరిస్థితి విషమించడంతో ఆస్పత్రిలోనే మృతి చెందాడు. మృతుడి తల్లి కురుబ భాగ్యమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## హోరాహోరీగా ఏపీ సూపర్ కప్ ఫుట్‌బాల్ టోర్నీ



ఉత్కంఠగా సాగుతున్న మ్యాచ్

**అనంతపురం:** ఏపీ ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అనంత క్రీడాగ్రామంలోని ఆర్డీటీ ఫుట్‌బాల్ స్టేడియం వేదికగా సాగుతున్న ఏపీ సూపర్‌కప్ ఫుట్‌బాల్ టోర్నీ రెండో రోజు హోరాహోరీగా సాగింది. తొలి మ్యాచ్‌లో తుంగభద్ర క్లబ్ జట్టుతో తలపడిన కోరమాండల్ క్లబ్ జట్టు 3-1 గోల్స్ తేడాతో విజయం సాధించింది. నల్లమల క్లబ్, పెన్నా క్లబ్ మధ్య జరిగిన రెండో మ్యాచ్‌లో ఇరు జట్లూ చెరో గోల్ సాధించడంతో మ్యాచ్ డ్రా అయింది. గోదావరి క్లబ్, వంశధార క్లబ్ మధ్య జరిగిన మూడో మ్యాచ్ ఉత్కంఠగా సాగింది. మ్యాచ్ ఆరంభం నుంచి గోదావరి క్లబ్ జట్టు క్రీడాకారులు దూకుడును ప్రదర్శిస్తూ వచ్చారు. 7-0 గోల్స్ తేడాతో గోదావరి క్లబ్ జట్టు ఘన విజయాన్ని నమోదు చేసింది. కొల్లేరు క్లబ్, విశాఖ క్లబ్ జట్ల మధ్య జరిగిన నాల్గో మ్యాచ్‌లో కొల్లేరు రెండు గోల్స్ సాధించింది. విశాఖ క్లబ్ జట్టు పేలవమైన ఆటతీరుతో ఒక్క గోల్ కూడా సాధించలేక చతికిలపడింది. ఈ మ్యాచ్‌లో కొల్లేరు క్లబ్ జట్టు విజయం సాధించింది. ఇప్పటి వరకూ జరిగిన మ్యాచ్‌ల్లో కొల్లేరు, కోరమాండల్ క్లబ్ జట్లు ఆరు పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచాయి. మ్యాచ్‌లను ఏపీ ఫుట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేణుగోపాల్, ఏపీఎఫ్‌ఏ సీనియర్ క్రీడాకారులు సుధాకర్, సిరాజుద్దీన్, నీలాద్రి, శేషగిరి రావు, అనిల్, సురేష్, పవన్, రాజేష్ పరిశీలించారు. మ్యాచ్ కమిషనర్‌గా రెడ్డప్ప వ్యవహరించారు.

### పోలీసుల అదుపులో కిడ్నాపర్లు?

**గోరంట్ల:** ఓ డ్రైవర్‌ను కిడ్నాప్ చేసిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. వివరాలు.. గోరంట్ల మండలం పుటగుర్లపల్లికి చెందిన నందకుమార్ కియా కంపెనీలో తాత్కాలిక కారు డ్రైవర్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ నెల 19న రాత్రి పాలసముద్రం ఉన్న నందకుమార్ వద్దకు కారులో చేరుకున్న నలుగురు తెలంగాణ వాసులు తాము తిరుపతికి వెళుతున్నామని, దారి చూపాలంటూ అభ్యర్థించారు. రూట్ చెప్పబోతుండగా అలా కాదని తమతో పాటు రావాలంటూ నందకుమార్‌ను కారులో ఎక్కించుకుని ముందుకు సాగారు. కొద్ది దూరం వెళ్లగానే నిర్మానుష్య ప్రాంతంలో కారు ఆపి నందకుమార్ వద్ద ఉన్న రూ.75,450 లాక్కొన్నారు. ఆ సమయంలో వారి బారి నుంచి తప్పించుకున్న బాధితుడు... ఘటనపై ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు వేగవంతం చేశారు. ఈ క్రమంలో అనంతపురం జిల్లాలోని ఓ టోల్‌ప్లాజా వద్ద కిడ్నాపర్లను గుర్తించి అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నట్లు సమాచారం. మరో రెండు రోజుల్లో నిందితులను అరెస్ట్ చూపి వివరాలు వెల్లడించే అవకాశముంది.

### రెసిడెన్షియల్ కళాశాలల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

**పరిగి:** ఏపీ రెసిడెన్షియల్ కళాశాలల్లో ఇంటర్, డిగ్రీ కోర్సుల్లో (2025-26 విద్యాసంవత్సరం) ప్రవేశానికి అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఏపీఆర్‌జేసీ, డీసీ విద్యా సంస్థల జిల్లా కోఆర్డినేటర్, కొడిగెనహళ్లి ఏపీఆర్‌జేసీ ప్రిన్సిపాల్ జలజ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు www. aprs.apcfss.in వెబ్‌సైట్ ద్వారా ఏపీఆర్ జేసీ, ఏపీఆర్ డీసీ సెట్‌కు ఈనెల 31లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఏప్రిల్ 25న రాష్ట్రంలోని 26 జిల్లాల్లో ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకూ జూనియర్ కళాశాలల్లో ప్రవేశానికి, అదేరోజు మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ డిగ్రీ కళాశాలల్లో ప్రవేశానికి పరీక్ష ఉంటుందని వివరించారు. అలాగే 38 సాధారణ పాఠశాలలు, 12 మైనార్టీ గురుకుల పాఠశాలల్లోనూ 5వ తరగతి ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని పేర్కొన్నారు. దీంతో పాటు 6, 7, 8 తరగతుల్లో, మిగులు సీట్ల కోసం 'ఏపీఆర్ఎస్ క్యాట్ 2025'కు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

### పండ్ల వ్యాపారి దుర్మరణం



మృతుడు ఖాసీం సాహెబ్

**పావగడ:** స్థానిక పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని దొమ్మతమరి గ్రామంలో శుక్రవారం తెల్లవారుజామున చోటు చేసుకున్న ప్రమాదంలో పండ్ల వ్యాపారి ఖాసీం సాహెబ్(60) దుర్మరణం పాలయ్యాడు. సీఐ సురేష్ తెలిపిన మేరకు... వెంకటాపురం గ్రామానికి చెందిన ఖాసీం సాహెబ్ పెనుకొండలో పండ్ల వ్యాపారం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం వేకువజామున తన టీవీఎస్ వాహనంపై బయలుదేరిన ఆయనను తెల్లవారుజాము 5 గంటలకు దొమ్మతమరి శివారులోకి చేరుకోగానే గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఘటనలో ఖాసీం సాహెబ్ అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ వాహనంతో పాటు ఉడాయించాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

### వ్యభిచారం కేసులో కానిస్టేబుల్ అరెస్ట్



కానిస్టేబుల్ పురుషోత్తం

**హిందూపురం అర్బన్:** అడ్డదారులు తొక్కి సులువుగా డబ్బు సంపాదించాలన్న ఓ కానిస్టేబుల్ ఏకంగా వ్యభిచారం నిర్వహిస్తూ పోలీసులకు పట్టుబడి కటకటాల పాలయ్యాడు. ఈ ఘటన హిందూపురంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. కానిస్టేబుల్ పురుషోత్తం హిందూపురం రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తూ ఇటీవలే మడకశిర స్టేషన్‌కు బదిలీ అయ్యాడు. హిందూపురంలోని మోడల్ కాలనీలో ఓ ఇంటిని అద్దెకు తీసుకున్నాడు. పట్టణంలోని బోయ పేటకు చెందిన ఓ మహిళతో కలిసి ఆ ఇంట్లో వ్యభిచార కేంద్రాన్ని ప్రారంభించాడు. ఇతర ప్రాంతాల నుంచి అమ్మాయిలను తీసుకు వచ్చేవారు. కానిస్టేబుల్ వ్యవహారశైలిని గమనించిన చుట్టుపక్కల ఇళ్ల వారు పలుమార్లు హెచ్చరించారు. అయినా పద్ధతి మార్చుకోకపోవడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. రెండో పట్టణ సీఐ అబ్దుల్ కరీం, సిబ్బంది ఈ నెల 18న రాత్రి ఆ ఇంటిపై దాడి చేసి కానిస్టేబుల్‌తో పాటు సదరు మహిళను అదుపులోకి తీసుకున్నారు. విచారణలో వ్యభిచారం నిర్వహిస్తున్న విషయం వెలుగు చూడటంతో శుక్రవారం ఇద్దరిపై కేసు నమోదు చేసి..రిమాండుకు తరలించారు. ఇదే కేసులో మేళాపురానికి చెందిన ఈశ్వర్ అనే వ్యక్తి పరారీలో ఉన్నట్లు సీఐ తెలిపారు. కాగా.. కానిస్టేబుల్ పురుషోత్తం గుడిబండ స్టేషన్‌లో పనిచేసిన సమయంలోనూ పలు ఆరోపణలతో సస్పెండ్ అయ్యాడు.

**మరో ఇద్దరు అరెస్టు..**

- హిందూపురం పట్టణంలోని సీపీఐ కాలనీలో ఎస్.బాబా, అతని భార్య వ్యభిచారం నిర్వహిస్తుండగా శుక్రవారం ఉదయం దాడి చేసి వారితో పాటు మరొక మహిళను అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు.

### 'స్థానిక' ఎన్నికల అధికారుల నియామకం

- ఉత్తర్వులు జారీ చేసిన ఉమ్మడి జిల్లా కలెక్టర్లు

**అనంతపురం సిటీ:** ఉమ్మడి జిల్లాలో ఐదు ఎంపీపీ, నాలుగు వైస్ ఎంపీపీ స్థానాలకు ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఎన్నికల అధికారులను నియమించారు. ఈ మేరకు ఉభయ జిల్లాల ఎన్నికల అధికారులు డాక్టర్ వి.వినోద్‌కుమార్, టీఎస్ చేతన్ ఉత్తర్వులు జారీ చేశారు.

మండలాల వారీగా నియమితులైన ఎన్నికల అధికారులు

| మండలం | ఎన్నిక | ప్రిసైడింగ్ అధికారి |
|---|---|---|
| గాండ్లపెంట | ఎంపీపీ | సుదర్శన్(ప్రాజెక్ట్ డైరెక్టర్, ఏపీఎంఐపీ) |
| రొద్దం | ఎంపీపీ | కె.విజయప్రసాద్(పీడీ, డీడబ్ల్యూఎంఏ) |
| రామగిరి | ఎంపీపీ | జి.సంజీవయ్య(ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ) |
| కణేకల్లు | ఎంపీపీ | జి.భార్గవ్(జిల్లా రిజిస్ట్రార్) |
| కంబదూరు | ఎంపీపీ | ఎం.సి.మద్దిలేటి(ఆత్మ పీడీ) |
| ఉరవకొండ | వైస్ ఎంపీపీ | ఖుష్బూ కొఠారి (బీసీ వెల్ఫేర్ ఎంపవర్‌మెంట్ ఆఫీసర్) |
| యల్లనూరు | వైస్ ఎంపీపీ | పి.రఘునాథరెడ్డి (ఉద్యానాధికారి) |
| పెద్దపప్పూరు | వైస్ ఎంపీపీ | ఎం.ప్రభాకర్‌రెడ్డి (డిప్యూటీ డైరెక్టర్, డెయిరీ) |
| రాయదుర్గం | వైస్ ఎంపీపీ | శ్రీనివాస యాదవ్ (జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్) |



అదుపుతప్పిన గూడ్స్ రైలు చక్రాలు



సహాయక చర్యలు చేపడుతున్న రైల్వే సిబ్బంది

### పట్టాలు తప్పిన గూడ్స్

**పెనుకొండ రూరల్:** బెంగళూరు నుంచి ధర్మవరం వెళ్తున్న గూడ్స్ రైలు శుక్రవారం ఉదయం 7 గంటల సమయంలో మండలంలోని మక్కాజిపల్లి స్టేషన్ సమీపంలో పట్టాలు తప్పింది. పాయింట్ క్రాస్ అయ్యే సమయంలో గూడ్స్ రైలు మధ్యన ఉన్న నాలుగు చక్రాలు ట్రాక్ దాటి బయటకు వెళ్లాయి. వెంటనే అప్రమత్తమైన రైల్వే అధికారులు, సహాయక చర్యలు చేపట్టారు. రైళ్ల రాకపోకలకు అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టారు. ఈ ఘటనలో ఎలాంటి నష్టం వాటిల్లలేదని రైల్వే అధికారులు తెలిపారు.